క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ వేణుగోపాల్

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస తహసీల్దార్‌గా కె.వేణుగోపాల్ బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ గణపతిరావు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ నుంచి వేణుగోపాల్ బదిలీపై మండలానికి వచ్చారు. తహసీల్దార్ వేణుగోపాల్‌ను రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

సమీకృత వసతి గృహం సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసి నాయుడు

సారవకోట: మండల కేంద్రంలోని సమీకృత వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వసతిగృహంలోని మౌలిక వసతులు, పరిసరాలను పరిశీలించారు. వసతిగృహంలో అమలు అవుతున్న మెనూ, విద్యార్థుల హాజరు, పాఠశాలలో అందిస్తున్న విద్య తదితర అంశాలను గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వార్డెన్ మోహన్‌రావును సూచించారు.

కోడూరు జీడితోట వేలం ఖరారు

పోలాకి: కోడూరు జీడిమామిడి తోట వేలం ఖరారైనట్లు ఎంపీడీఓ ఉషశ్రీ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలంలో ప్రకాశరావుపేట గ్రామానికి చెందిన చింతాడ ఉమామహేశ్వరరావు రూ.1.40 లక్షలకు తోటను పంట కాలానికి దక్కించుకున్నారన్నారు. వేలంపాటలో 22 మంది డిపాజిట్‌దార్లు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వీరిలో నలుగురు మాత్రమే వేలంలో పాల్గొన్నారన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో భగీరథిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం పూర్ణచంద్రరావు బుధవారం తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ పరీక్షల్లో తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఐ.హేమలత, హారిక ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. జిల్లా స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు జగదీష్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయాభివృద్ధికి రూ.50 వేల విరాళం


రూ.50 వేలు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడలో ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయం పునఃనిర్మాణానికి అదే గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగులు దాస్యం వేణుగోపాల్, దాస్యం చరణ్‌కుమార్ రూ.50 వేలు విరాళం బుధవారం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మొర్రి లోకేశ్వరరావు, దాస్యం నారాయణస్వామికి ఈ మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులు అందించారు. ఆలయం అభివృద్ధికి దాతలు సహాయం చేయాలని నారాయణస్వామి కోరారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

132 మందికి వైద్య సేవలు


వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు సదాశివ

పాతపట్నం: కాగువాడ అంగన్‌వాడీ కేంద్రంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు జి.సదాశివ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి 132 మంది రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంచం పట్టిన రోగులు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేపట్టి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఏఎన్‌ఎంలు కుమారి, అన్నపూర్ణ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

ఎంతో అభివృద్ధి సాధించాం

- అసెంబ్లీ సమావేశంలో మాట్లాడిన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత పాతపట్నం నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి సాధించామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. అసెంబ్లీ సమావేశంలో బుధవారం ప్రసంగించారు. నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధిపై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 70 ఏళ్లుగా ఎంతో వెనుకబడిన పాతపట్నం నియోజకవర్గం.. జగనన్న పాలనలోనే అభివృద్ధి సాధించామన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే.. మరోవైపు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. రూ.2 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. వంశధార నిర్వాసితులకు టీడీపీ నాయకులు అన్యాయం చేశారన్నారు. నిర్వాసితులకు జరిగిన అన్యాయం చూసిన జగనన్న అధికారం చేపట్టిన తరువాత రూ.216.71 కోట్ల నిధులు అదనపు పరిహారం విడుదల చేశారన్నారు. జిల్లాలో 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వంశధార రిజర్వాయర్‌పై లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేశారన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులకు వంశధార జలాలను తాగునీరుగా అందించేందుకు రూ.700 కోట్లు ఇచ్చారని, హిరమండలం రిజర్వాయర్‌ను నుంచి తాగునీరు అందివ్వడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వంశధార తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు నిధులు మంజూరు చేశారని, ఇది గొప్పవిషయమన్నారు. పాతపట్నం మండలంలోని మహేంద్రతనయ నదిపై కాగువాడ–రొమదల వంతెన, రోడ్డు నిర్మాణం కోసం రూ.11 కోట్లు ఖర్చుతో 8 నెలల్లో పనులు పూర్తి చేశామన్నారు. కొత్తూరు రూ.46 కోట్లతో విద్యుత్ స్టోరేజ్ సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయటం గర్వకారణంగా ఉందన్నారు. కొత్తూరులో ప్రభుత్వ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన 56 నెలల పాలనలో ఇన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన ఐక్యవేదిక నాయకులు

సారవకోట: జిల్లాలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సారవకోట, మెళియాపుట్టి, మందస మండలాల గిరిజన ఐక్యవేదిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. విజయనగరంలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో పోడు పట్టాలు, ఉపాధికి సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శ్రీకాకుళం జిల్లాలోని తమ మండలాలను సందర్శించాలని కోరారు. దీనిపై ఎస్టీ కమిషన్ చైర్మన్ స్పందిస్తూ గిరిజనుల సమస్యలపై ఎప్పుడైనా తనను కలిసి తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, శాంతారావు, భాస్కరరావు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

రూ.75 లక్షలతో రహదారి నిర్మాణం


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బైరాగినాయుడు

పోలాకి: మండలంలోని పోలాకి–నరసన్నపేట ప్రధాన రహదారి నుంచి గొల్లలవలస వరకు బీటీ రహదారి నిర్మాణానికి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.75లక్షల అంచనా నిధులతో 2.8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పూర్తిగా పట్టించుకోకుండా వదిలేయటంతోనే రహదారులు పాడయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో ముఖ్యంగా చల్లబంద, రాళ్లగోదాయివలస, గంగివలస, జిల్లేడువలస, రేగుపాడు గ్రామాలకు సీసీ రహదారులు, తీర ప్రాంతంలో బీటీ రహదారులు నిర్మాణం చేపట్టామన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి


మాట్లాడుతున్న ఎంపీపీ అరంగి మురళి

నరసన్నపేట: మాకివలస పీహెచ్‌సీ అభివృద్ధి, సలహా సంఘం సమావేశాన్ని ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పీహెచ్‌సీని ఎంతగానో అభివృద్ధి చేశామని,, అన్ని మౌళిక వసతులు కల్పించామన్నారు. మందులు బడ్జెట్ పెంచామని, రక్త పరీక్షలకు సంబంధించి అధునాతన పరికరాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇద్దరు వైద్యులను నియమించడం జరిగిందన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఉన్న రూ.1.70 లక్షల వినియోగానికి వీలుగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణారావు, ముచ్చ కరుణ, వైద్యులు శిరీష, సీతామహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో పాతపట్నం

పాతపట్నం: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, దేవాంగుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.చంద్రయ్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వంశధార నిర్వాసితులకు సీఎం జగన్ న్యాయం చేశారని, రూ.175 కోట్లతో వంశధార ప్రాజెక్టు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారని, 5 లక్షల ఎకరాల వ్యవసాయం కోసం సాగునీరు అందించారన్నారు. వీటితో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, పార్టీ కార్యదర్శి జి.రాము, మండల నాయకులు పనుకు మోహన్, నేతాజీ, కృష్ణారావు, సవిరిగాన శ్రీను, తులుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతోనే..

కొత్తూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతోపాటు ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో కొత్తూరు మండల అభివృద్ధి పథకంలో పయనిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. కొత్తూరు మండలంలోని గిరిజన గ్రామాల్లో వందలాది కోట్లతో రోడ్డు పనులు చేయించామన్నారు. మెట్టూరు నుంచి డెప్పిగూడ, లబ్బ నుంచి దొండమానుగూడ, రెల్లిగూడ నుంచి కొమ్మల గూడ, రాయల నుంచి టింపటిగూడ, కేపీ రోడ్డు నుంచి రెల్లిగూడ, పుట్టిగాం నుంచి అభలాసింగి, దిమిలి నుంచి బొడ్డగూడ వరకు రోడ్డు పనులు చేపట్టామన్నారు. వీటితోపాటు పలు గిరిజన గ్రామాల్లో సుమారు రూ. 20 కోట్లతో రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో గిరిజన గ్రామాల్లో రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. పార్టీ నాయకులు జి.ఆనందరావు, పి.సాధుబాబు, పంకజదాస్, వై.ధర్మారావు, జి.రాజులునాయుడు, డి.అప్పన్న, వి.సూర్యనారాయణ, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థల సభ్యులు

హిరమండలం: నైతిక విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరముందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు లింగరాజు మాస్టారు అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని పలు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా స్థానిక కేజీబీవీ, అవలంగి, రామేశ్వర కళాశాల విద్యార్థులు నిలిచారు. వీరికి బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లింగరాజు మాస్టారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలన్నారు. అవలంగి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్లు అప్పలనాయుడు, వెంకటరావు, ప్రేమసాయి వృద్ధాశ్రమం కో ఆర్డినేటర్ సాయిబాబా, చంటి మాస్టారు, ఊణ్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తాగునీటి సమస్య ఉందని ఫిర్యాదు చేసిన 24 గంటల్లో స్పందించి సమస్యను పరిష్కారించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈఓపీఆర్డీ ఐ.పద్మజ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు


చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఫిజియోథెరపీ వరమని ఐఈఆర్టీ డాక్టర్ గ్రేసీ ప్రీతి అన్నారు. మండల భవిత కేంద్రంలో బుధవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. ప్రతిరోజూ ఇంటివద్ద సాధన చేస్తే ప్రతిఫలం ఉంటుందన్నారు. మండలం నలుమూలల నుంచి ప్రత్యేకావసరాలగల చిన్నారులు హాజరయ్యారు. ఐఆర్‌టీసీ ఉపాధ్యాయుడు సీతంనాయుడు, సీఆర్పీ గోవిందరావు పాల్గొన్నారు

డీవార్మింగ్ డేపై అవగాహన


సరుబుజ్జిలి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు


పాతపట్నం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ-2 తిరుమలరావు, వైద్యులు

సరుబుజ్జిలి: ఈ నెల 9 డీవార్మింగ్ డే సందర్భంగా నులిపురుగుల మాత్రల పంపిణీ విధానంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందికి సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సంతోష్‌కుమార్, సాహితి బుధవారం అవగాహన కల్పించారు. 66 అంగన్‌వాడీ, 55 ప్రభుత్వ పాఠశాలలు, 4 ప్రైవేట్ పాఠశాలల్లోని 5,514 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఎం.రత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం: చిన్నారులకు నులిపురుగుల మాత్రలు వేయాలని బైదలాపురం, గంగువాడ పీహెచ్‌సీ వైద్యులు జి.సదాశివ, ఎస్.శివ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్‌ను ఎంఈవో–2 సీహెచ్ తిరుమలరావుతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యుడు సదాశివ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని 16,038 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ పరిశీలన


చొర్లంగిలో భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

హిరమండలం: మండలంలోని రైతులు ఈ–క్రాప్ (పంటల బీమా) నమోదు చేసుకున్నారా, లేదా అని టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్ పింద్రువాడలో రబీ సాగును బుధవారం పరిశీలించారు. చర్లంగి పరిధిలోని నాలా (పన్ను) చెల్లించాల్సి స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ అధికారులతో మండలంలో జరుగుతున్న భూ సర్వేపై చర్చించారు. భూ సర్వే పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బందికి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలకు చెక్ చెప్పేందుకు ప్రభుత్వం సమగ్ర సర్వే చేపడుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎటువంటి విమర్శలు రాకుండా పారదర్శకంగా సర్వే చేపట్టాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరుకోవాలి

మెళియాపుట్టి: నిర్ధేంచిన లక్ష్యాలను ఉపాధి సిబ్బంది చేరుకోవాలని ఎంపీడీఓ కొండలరావు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం పూర్తికావడానికి తక్కువ సమయం ఉందని, శ్రద్ధతో పనిచేసి దరఖాస్తు చేసుకున్న ప్రతీకుటుంబానికి 100 రోజుల పనిదినాల కల్పించాలన్నారు. వేతనాలు ఇప్పటికే జమఅయ్యాయని, అధిక సంఖ్యలో వేతనదారులను పనిలో పెట్టడానికి కృషిచేయాలన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, క్షేత్ర సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.